మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 22-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 293 Issue: 293

22 ఏప్రిల్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:30 తిథి షష్ఠి రా. 10:54 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఆరుద్ర రా. 10:15 వరకు తరువాత పునర్వసు యోగం అతిగండ ఉ. 9:08 వరకు కరణం కౌలవ మ. 12:05 వరకు తైతుల రా. 10:54 వరకు వర్జ్యం ఉ. 7:45 నుండి ఉ. 9:14 వరకు దుర్ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:39 వరకు రాహుకాలం మ. 12:14 నుండి మ. 1:48 వరకు యమగండం ఉ. 7:33 నుండి ఉ. 9:07 వరకు గుళికాకాలం ఉ. 10:40 నుండి మ. 12:14 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు మ. 12:56 నుండి మ. 2:25 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial





# బస్సుల 'సమ్మె' సైరన్

## ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వ చర్చలు విఫలం

### అర్ధరాత్రి నుంచి సమ్మెకు కార్మిక సంఘాలు.. డిపోలకే పరిమితం కానున్న బస్సులు

రాష్ట్రంలో బస్సు చక్రం అర్ధరాత్రి నుంచి ఆగిపోనుంది. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ సమ్మె నోటీసు ఇచ్చిన టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ.. సాయంత్రం నుంచి చర్చలు జరపగా.. అవి ఎట్టకేలకు విఫలంగానే ముగిశాయి. దీంతో ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 22వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): టీజీఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వ కమిటీ జరిపిన చర్చలు సఫలం కాకపోవడంతో.. కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో రేపు ఉదయం నుంచి రాష్ట్రంలోని వేలాది బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. తమ 32 ప్రధాన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఎలాంటి స్పష్టమైన హామీ తరువాయి 2 వ పేజీలో...

## తెలంగాణకు కొత్తగా 8 రైళ్లు

### ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి రైళ్లు

తిరుపతి, భువనేశ్వర్, జైపూర్‌కు ప్రయాణం



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): తెలంగాణ ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా 8 కొత్త వీక్లీ ప్రత్యేక రైళ్లకు ఆమోదం తెలిపింది. ఈ రైళ్లు హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి తిరుపతి, తిరుచానూర్, భువనేశ్వర్, జైపూర్, శ్రీ గంగానగర్ వంటి కీలక నగరాలకు రాకపోకలు సాగిస్తాయి. ఈ కొత్త రైళ్ల ఏర్పాటుపై కేంద్ర -2 వ పేజీలో...

# ముఖ్యమంత్రి.. ముద్దాయి



### ఓటుకు నోటు కేసులో దొంగ.. అలాంటి దొంగకు శిక్ష పడాలి

### ఏళ్లుగా స్టే మీద బతుకుతున్నడు..రేవంత్‌పై హరీశ్ రావు ధ్వజం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాల సభ టైమ్‌లో ఢిల్లీ వెళ్లడంపై వస్తున్న రూమర్స్‌పై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇప్పించాడని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. విషయం లేని వాళ్లే ఇలాంటి చిల్లర పనులకు దిగుతారని విమర్శించారు. 'నేను, వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర కలిసి ఢిల్లీకి వెళ్లా'మని తెలిపారు. బుధవారం కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు ఇవ్వబోతుందని పేర్కొన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): హైకోర్టులో న్యాయం జరుగుతుందని తమకు నమ్మకం ఉందని తెలిపారు. ఒకవేళ హైకోర్టులో తీర్పు అనుకూలంగా రాకపోతే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ వేయడానికి సీనియర్ న్యాయవాదులను కలిశామని వెల్లడించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై కూడా చర్చించామని హరీశ్‌రావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ కూడా ఉందని తెలిపారు. ఓటుకు నోటు కేసులో పట్టపగలు రూ.50 లక్షల బ్యాగ్‌తో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. హోంమంత్రివి నువ్వే.. ముఖ్యమంత్రివి నువ్వే.. ముద్దాయివి నువ్వే అని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసు నుంచి బయటపడేందుకు రేవంత్ రెడ్డి ముకుల్ రోహత్గి, సిద్ధార్థ లూథ్రాను న్యాయవాదులుగా పెట్టుకున్నాడని తెలిపారు. ప్రభుత్వం తరపున గౌరవ్ అగర్వాల్‌ను పెట్టుకున్నారని పేర్కొన్నారు. 'మా ప్రభుత్వాన్ని కూలగొట్టాలని పన్నాగం కట్టినవ్ కదా.. బీఆర్ఎస్ తరఫున మంచి న్యాయవాదులను పెట్టేందుకు ఢిల్లీకి వెళ్లా'మని స్పష్టం చేశారు. తమ నాయకుడి ఆదేశం మేరకు ఢిల్లీ వెళ్లి న్యాయవాదులతో మాట్లాడామని హరీశ్‌రావు తరువాయి 2 వ పేజీలో...



# మోదీ టెర్రరిస్ట్

### ప్రధానికి సమన్యాయంపై నమ్మకం లేదు

### రాజకీయ పార్టీలను భయపెడుతున్నారు

### కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

### వివాదం నేపథ్యంలో అనలేదని వివరణ

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రిని 'టెర్రరిస్టు'గా అభివర్ణించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరిరోజైన మంగళవారంనాడు ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, అనంతరం టెర్రరిస్టు వ్యాఖ్యలపై ఖర్గే వివరణ ఇచ్చారు.

చెన్నై: బీజేపీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, సీబీఐ, ఈడీ, ఆదాయం పన్ను శాఖ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఆ సందర్భంలోనే తాను మాట్లాడానని, ఆయన (మోదీ)ను టెర్రరిస్టు అని తాను అనలేదని చెప్పారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు. ఇక, తరువాయి 2 వ పేజీలో...




| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.15,529 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,236 |

# రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు



### చావు.. చావు.. అని తిట్టుకుంటున్నరు

### వారిద్దరూ కలిసి ప్రజలను చంపుతున్నరు

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం

కరీంనగర్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహువు అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేతువు అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. నువ్వు చావాలంటే నువ్వు చావాలంటూ ఒకరికొకరు పైకి తిట్టుకుంటూ ఇద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను చంపుకు తింటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం సహా కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతిని కప్పిపుచ్చేందుకు రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. కరీంనగర్‌లోని రేకుర్తి చెరువు సుందరీకరణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల రమేశ్, తరువాయి 2 వ పేజీలో...



# కేరళలో ఘోర విషాదం

### బాణసంచా పరిశ్రమలో పేలుడు, 13 మంది మృతి

### త్రిస్సూర్ పూరం వేడుకల్లో భారీ పేలుడు

త్రిస్సూర్: కేరళలోని ప్రసిద్ధ త్రిస్సూర్ పూరం వేడుకల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కేంద్రంలో సోమవారం జరిగిన భారీ పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తరువాయి 2 వ పేజీలో...

## 27న తెలంగాణ భవన్‌కు

# కేసీఆర్



### పార్టీ ఆఫీస్‌లో కీలక సమావేశం

### భవిష్యత్ కార్యాచరణపై ప్రకటనకు చాన్స్

జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ ద్వారా దాదాపు ఏడాది తర్వాత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించడం.. గులాబీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నింపింది. కేసీఆర్ ఈజ్ బ్యాక్ అంటూ.. కారు పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): అధికార కాంగ్రెస్ పార్టీపై, మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేసీఆర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు, విమర్శలతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల్లో నూతనోత్తేజం లభించింది. ఈ నేపథ్యంలోనే త్వరలోనే మరోసారి కేసీఆర్.. ఇంకో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) (గతంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)) ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన మాంసాన్ని నిషేధించిన తొలి దేశం ఇటలీ. ఇక్కడ ఇతర కృత్రిమ ఆహార ఉత్పత్తులను కూడా బ్యాన్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.


# ఒప్పందం లేకపోతే యుద్ధమే

### స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు.. నేటితో ముగియనున్న సీజ్ ఫైర్ గడువు




ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగింపు దశకు చేరుకోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బుధవారంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు.

వాషింగ్టన్: కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసిన తర్వాత ఇరాన్‌తో యుద్ధానికి సిద్ధమవుతామని ప్రకటించారు. 'కాల్పుల విరమణ గడువు ముగిసేలోగా ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌తో తిరిగి యుద్ధానికి వెళ్లడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని ట్రంప్ ప్రకటించారు. ఈ రోజు (మంగళవారం) ఇస్లామాబాద్‌లో ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య రెండో దఫా శాంతి చర్చలు -2 వ పేజీలో...



# మూగబోయిన మైకులు

### తమిళనాడు, బెంగాల్‌లో ప్రచారం బంద్

### రేపు తమిళనాడులో ఒకే విడత పోలింగ్

### తొలి విడతలో బెంగాల్‌లో 152 స్థానాలకు

### మే 4వ తేదీన వెల్లడి కానున్న ఫలితాలు

చెన్నై/కోల్‌కతా: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల కీలకమైన "నిశ్శబ్ద సమయం" (సైలెన్స్ పీరియడ్) అధికారికంగా ప్రారంభమైంది. దీంతో బహిరంగ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

22.4.2026

మేషం: అవసరానికి సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. మధ్యలో నిలిచిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకుంటారు.

వృషభం: కొన్ని వ్యవహారాలలో ఆప్తులతో వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

మిథునం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంఘంలో పెద్దల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

కర్కాటకం: ఉద్యోగస్తుల జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. సమాజంలో పరిచయాలు విస్తృతమౌతాయి. స్థిరాస్తి వ్యవహారాలలో సమస్యలు అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

సింహం: కొన్ని వ్యవహారాలు మధ్యలో నిలిచిపోతాయి. వ్యాపారాలలో ద్విస్వభావ ఆలోచనలు చేసి ఇబ్బంది పడతారు. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. మిత్రులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

కన్య: నూతన ఋణ యత్నాలు కొంత కష్టంతో పూర్తి అవుతాయి. బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. దూరపు బంధువుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. వ్యాపార వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వృత్తి ఉద్యోగాలు కొంత సామాన్యంగా లాభిస్తాయి.

తుల: బంధుమిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. భూ క్రయవిక్రయాలలో విశేషమైన లాభాలు అందుతాయి. చేపట్టిన పనిలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ పెద్దలతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి,ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: ఆప్తులతో దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. వృత్తి ఉద్యోగ విషయంలో ఉన్న సమస్యలు అధిగమిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సంతాన విద్యా విషయాలు నిరాశపరుస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

మకరం: దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువుల నుండి అందిన ఒక వార్త నిరుత్సాహం కలిగిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

కుంభం: ఆత్మీయులతో కీలక విషయాల గురించి చర్చిస్తారు. మిత్రుల సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు కుదురుతాయి. నూతన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆర్థిక సమస్యల నుంచి బయటపడతారు.

మీనం: ఋణ దాతలు నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆకస్మిక దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. సంతాన ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో విఫలమౌతారు.




# ముఖ్యమంత్రి.. ముద్దాయి

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. 'నీలాంటి దొంగలకు శిక్ష పడాలనేది మా ప్రయత్నం. నాలుగున్నరేళ్లుగా నువ్వు స్టే మీద బతుకుతున్నావు' అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. స్టే వెకేట్ అయితే జైలుకు వెళ్తావని హెచ్చరించారు. పొద్దుగాల్ల కాంగ్రెస్, రాత్రిపూట బీజేపీతో తిరుగుడు రేవంత్ రెడ్డికి అలవాటు అని విమర్శించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ సభ జరిగిన రోజే కాంగ్రెస్ కూడా సభ ఏర్పాటు చేయడంపై హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు" కాంగ్రెస్ తీరు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారని, కేసీఆర్ స్థాయికి, రేవంత్ రెడ్డి స్థాయికి చాలా తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. నిన్నటి జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని, సభలో రేవంత్ పేరును కూడా ఆయన ప్రస్తావించలేదని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హుందాగా మాట్లాడితే కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని ఆయన సూచించారు. మిగిలిన రెండున్నరేళ్ల కాలంలోనైనా ప్రజలకు మంచి పాలన అందించే ప్రయత్నం చేయాలని, రాజకీయ కక్ష సాధింపులు, ఫిరాయింపుల ప్రోత్సాహం మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## 27న తెలంగాణ భవన్‌కు కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

రజతోత్సవ సంబురాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 27వ తేదీన రజతోత్సవాల ముగింపు వేళ కేసీఆర్.. పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై కేసీఆర్ కూలంకషంగా చర్చలు జరపనున్నారు. పార్టీ సభ్యత్వాలను పునరుద్ధరించడంతోపాటు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలపైనా గులాబీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగానే పార్టీ భవిష్యత్ కార్యాచరణను కేసీఆర్ ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు గులాబీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు.. ఈ సమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న బీఆర్ఎస్.. పార్టీలోని అన్ని స్థాయిల కీలక నేతలకు ఇప్పటికే ఆహ్వానం పంపించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు.. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు.. కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్లు కూడా హాజరు కావాలని ఆహ్వానించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం తెలంగాణలో శరవేగంగా రాజకీయ పరిణామాలు మారుతున్న వేళ.. కేసీఆర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. కే

## రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

మొదటి పేజీ తరువాయి

బోయినిపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి తదితరులతో మీడియాతో రేవంత్ రెడ్డి, కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ..'కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా అమృత్– 2 పథకంలో భాగంగా 3 చెరువుల పునరుజ్జీవం కోసం 5 కోట్ల 82 లక్షల రూపాయల నిధులను కేంద్రం మంజూరు చేసింది. అందులో భాగంగా 1 కోటి 98 లక్షల రూపాయలతో ఈరోజు రేకుర్తి చెరువు పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. డ్రైనేజీ నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు రేకుర్తి చెరువును అందంగా తీర్చిదిద్ది కరీంనగర్ ప్రజలు కుటుంబాలతో కలిసి వచ్చి సేద తీరేలా మినీ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా. దీంతోపాటు కరీంనగర్ గల్లీలోని రోడ్లను నిర్మించాలని నిర్ణయించాం. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ లో గుంతలు పడ్డ అన్ని గల్లీల్లో రోడ్లను నిర్మిస్తాం. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. నువ్వు చావాలని ఒకరు, నేను చావాలని కోరుకుంటావా? అని ఇంకొకరు చావుల గురించి మాట్లాడుకుంటున్నారు. నిజానికి వీళ్లిద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను సంపుకొనితింటున్నారు. కాళేశ్వరం విషయంలో లక్ష కోట్ల రూపాయల స్కాం జరిగిందని గత ఎన్నికల్లో పదేపదే చెప్పిన రేవంత్ రెడ్డి.. సీఎం అయ్యాక అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీ అక్రమాలపైనే విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాశారు. నిజానికి వాటి విలువ రూ.9 వేల కోట్లు మాత్రమే. డిజైన్ లోపాలవల్లే ఆయా బ్యారేజీలు డ్యామేజీ అయ్యాయని అందరికీ తెలుసు. అయినా లక్ష కోట్ల ధనం వృథాపైనా, అవినీతిపైన సీబీఐ విచారణ జరపాలని ఎందుకు కోరడం లేదు? కేసీఆర్ కుటుంబాన్ని కాపాడటానికే రేవంత్ రెడ్డి చాలా తెలివిగా 9 వేల కోట్లపైనే విచారణ జరపాలని సీబీఐ లేఖ రాస్తున్నారు. మోటార్ల కొనుగోలులోనే పెద్ద అవినీతి చేశారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాళేశ్వరం విషయంలో వీళ్లు ఆడుతున్న డ్రామాలపై తెలంగాణ ప్రజలకు త్వరలోనే లేఖ రాస్తాం. జీవన్ రెడ్డి విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద విధానాలను పాటిస్తోంది. జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవడం ఇష్టం లేక అలిగి ఢిల్లీ పోయారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వాళ్లే బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు కోసం పోయారని అంటున్నారు. అన్నీ అబద్దాలే.

## మూగబోయిన మైకులు

మొదటి పేజీ తరువాయి

సభలు, ర్యాలీలు, ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా, బెంగాల్ లో తొలి దశ పోలింగ్ జరగనుంది. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగియనుండటంతో, మార్చి 15న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరపనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో, గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, అన్నాడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీటికి తోడు నామ్ తమిళర్ కట్చి, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలు కూడా స్వతంత్రంగా బరిలో నిలవడంతో ఈసారి చతుర్ముఖ పోటీ ఆసక్తికరంగా మారింది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా అగ్రనేతలంతా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, భారీ బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ప్రచారం ముగియడంతో, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. తమిళనాడు ముఖ్య ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఏప్రిల్ 21 సాయంత్రం 6 గంటల నుంచి ఏప్రిల్ 23న పోలింగ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఈ నిబంధనల ప్రకారం, బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార సంబంధిత సమావేశాలను నిర్వహించరాదు. టెలివిజన్, రేడియో, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు ఎస్ఎంఎస్‌లు లేదా ఇంటర్నెట్ ద్వారా ఎన్నికల సంబంధిత కంటెంట్‌ను వ్యాప్తి చేయడంపై పూర్తి నిషేధం విధించారు.




## బస్సుల 'సమ్మె' సైరన్

మొదటి పేజీ తరువాయి

రాకపోవడంతో కార్మిక నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం హుటాహుటిన ముగ్గురు అధికారులతో కూడిన ఒక హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ.. ఫలితం రాలేదు. డిమాండ్లను నెరవేర్చకుండా మరికొంత కాలం కాలయాపన చేసేందుకే కమిటీ ఏర్పాటు చేశారని.. జేఏసీ ఛైర్మన్ ఈదూరు వెంకన్న, జేఏసీ నేత థామస్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అయితే కార్మికులు చెబుతున్న సమస్యలు, డిమాండ్లను పరిష్కరించేందుకు 4 వారాల సమయం కావాలని కమిటీ పేర్కొంది. కానీ అందుకు కార్మిక సంఘాల నేతలు నిరాకరించారు. ఇప్పుడు చెప్పిన సమస్యలు, లేవనెత్తిన డిమాండ్లు కొత్తవేమీ కాదని.. గతం నుంచి చెబుతున్నవేనని వెల్లడించారు. అంతే కాకుండా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని తాము కోరుతున్నట్లు కార్మిక జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఇక ఆర్టీసీ సమ్మె ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోనున్నాయి. దీంతో నిత్యం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే దాదాపు లక్షలాది మంది ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు. ఆర్టీసీ సమ్మెను అదునుగా చేసుకుని.. ప్రైవేటు వాహనాలు, ఆటోలు భారీగా దోచుకునే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

## మోదీ టెర్రరిస్ట్

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్, డీఎంకే కూటమి సాగించిన ప్రచారంపై మీడియా అడిగినప్పుడు, చాలాబాగా జరిగిందని, అన్ని చోట్ల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తమ కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఖర్గే సమాధానమిచ్చారు. రాహల్ గాంధీ, స్టాలిన్ ఒకే వేదిక నుంచి ప్రచారం సాగించకపోవడంపై అడిగినప్పుడు, ఆ విధంగా చూడకూడదని, ప్రతి ఒక్కరూ ప్లానింగ్ ప్రకారమే ప్రచారం చేస్తుంటారని చెప్పారు. 'నేను ఒకచోట నుంచి ప్రచారం చేస్తే, రాహుల్ మరో చోట ఉంటారు. ఎవరు ఎక్కడ ప్రచారం చేసినా సమష్టి ఆలోచనతోనే ప్రచారం సాగుతుంది. అంతా కలిసికట్టుగా పోరాటం సాగించాం. మేము గెలుస్తాం' అని ఖర్గే పేర్కొన్నారు.

## తెలంగాణకు కొత్తగా 8 రైళ్లు

మొదటి పేజీ తరువాయి

మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి నిరంతరం సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త రైళ్లు రాష్ట్ర అభివృద్ధికి, పౌరుల సౌకర్యానికి ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

కొత్తగా ప్రకటించిన రైళ్లు ఇవే:

1.ట్రైన్ నెం. 17607/17608: కాచిగూడ – తిరుచానూర్ (ప్రతి గురువారం రాత్రి 9:30 గంటలకు, మే 15 నుంచి ప్రారంభం)

2.ట్రైన్ నెం. 17601/17602: కాచిగూడ – శ్రీ గంగానగర్ (ప్రతి శనివారం రాత్రి 10:00 గంటలకు, జులై 14 నుంచి ప్రారంభం)

3.ట్రైన్ నెం. 17047/17048: చర్లపల్లి – తిరుచానూర్ (ప్రతి బుధవారం సాయంత్రం 6:55 గంటలకు, మే 7 నుంచి ప్రారంభం)

4.ట్రైన్ నెం. 17441/17442: చర్లపల్లి – తిరుపతి (ప్రతి బుధవారం రాత్రి 9:20 గంటలకు, మే 14 నుంచి ప్రారంభం)

5.ట్రైన్ నెం. 17443/17444: చర్లపల్లి – తిరుపతి (ప్రతి శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు, మే 15 నుంచి ప్రారంభం)

6.ట్రైన్ నెం. 17059/17060: చర్లపల్లి – తిరుచానూర్ (ప్రతి ఆదివారం రాత్రి 9:15 గంటలకు, మే 11 నుంచి ప్రారంభం)

7.ట్రైన్ నెం. 17067/17068: చర్లపల్లి – భువనేశ్వర్ (ప్రతి సోమవారం సాయంత్రం 6:10 గంటలకు, మే 5 నుంచి ప్రారంభం)

8.ట్రైన్ నెం. 17079/17080: నాంపల్లి – జైపూర్ (ప్రతి శుక్రవారం రాత్రి 7:50 గంటలకు, ప్రారంభ తేదీ ప్రకటించాల్సి ఉంది)

## ఒప్పందం లేకపోతే యుద్ధమే

మొదటి పేజీ తరువాయి

జరగాల్సి ఉంది. అయితే బెదిరింపుల నీడలోనూ, అమెరికా నావికా దిగ్బంధనం కొనసాగుతున్న నేపథ్యంలోనూ చర్చలు జరపబోమని టెహ్రాన్ స్పష్టం చేసింది. ముందుగా అమెరికా తన చర్యలను ఆపాలని డిమాండ్ చేసింది. కాగా, ఇరాన్‌తో తమతో శాంతి ఒప్పందం కుదుర్చుకునే వరకు నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. డీల్ కుదరకపోతే మళ్లీ యుద్ధానికి సిద్ధమని ప్రకటించారు. డీల్ ద్వారానే శాంతి, భద్రత, రక్షణ చేకూరుతాయని ట్రంప్ స్పష్టం చేశారు.

# కేరళలో ఘోర విషాదం

మొదటి పేజీ తరువాయి

తీవ్రంగా గాయపడ్డారు. భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయ ఉత్సవాల్లో ఒకటైన త్రిస్సూర్ పూరం కోసం బాణసంచా సిద్ధం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పేలుడు ధాటికి భారీగా మంటలు ఎగసిపడి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకోవడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

ప్రతి ఏటా మలయాళ నెల 'మాడం'లో పూరం నక్షత్రం రోజున త్రిస్సూర్‌లోని వడక్కునాథన్ ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆసియాలోనే అతిపెద్ద పండుగల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ వేడుకకు పది లక్షలకు పైగా భక్తులు హాజరవుతారు. ఈ ఉత్సవాల్లో బాణసంచా ప్రదర్శన చాలా ప్రత్యేకం. దీనికోసం సిద్ధం చేస్తున్న షెడ్‌లోనే ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులైన వైద్యులను రప్పిస్తామని ఆయన అన్నారు.

పోలీస్, ఫైర్, ఆరోగ్య, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల సమన్వయంతో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం త్రిస్సూర్ మెడికల్ కాలేజీలో 13 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. బాణసంచా నిల్వ, నిర్వహణలో భద్రతా లోపాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విషాద ఘటనతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ ఉత్సవాలపై విషాద ఛాయలు అలుముకున్నాయి.



# 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా?

## తెలంగాణలో యువత అంతా ఏమైంది?.. కేసీఆర్ సభపై కవిత సెటైర్లు



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రస్థానానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కొత్త రాజకీయ పార్టీని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. తన కొత్త పార్టీలో యువతకు, తెలంగాణ ఉద్యమకారులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై, ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగిత్యాలలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ సభలో సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఈ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా తప్పుబట్టారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకు 25 ఏళ్లు తగ్గిపోయాయని, నవ యువకుడిగా అద్భుతాలు చేస్తారని కేసీఆర్ పొగడటం హాస్యాస్పదమన్నారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువకులు ఏమవ్వాలని ఆమె ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పచ్చి తెలంగాణ వ్యతిరేకి అయిన జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకుని, తెలంగాణ పునర్నిర్మాణం గురించి మాట్లాడటం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉట్టి కథలు చెబుతుంటే, అధికార కాంగ్రెస్ పార్టీ పిట్ట కథలు చెబుతోందని, కానీ ఏ ఒక్కరూ ప్రజల కష్టాల గురించి మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి వారిని తప్పుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సభలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదని, మహిళా రిజర్వేషన్ల ఊసే ఎత్తలేదని ఆమె మండిపడ్డారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో ఆ పార్టీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు. కొత్త పార్టీ ప్రకటన నేపథ్యంలో నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు సహకరించాలని, అడ్డంకులు సృష్టించవద్దని కవిత కోరారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులు ఎదిగేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో తమ సమస్యల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు కవిత తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రజల గొంతుకగా నిలిచేందుకే తాను నూతన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

### జాగృతిలో టీడీపీ నేత చేరిక

తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకుడు సయ్యద్ అహ్మద్ మంగళవారం తెలంగాణ జాగృతిలో చేరారు. ఆయన రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడిగా ఉన్నారు. మంగళవారం సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తన అనుచరులతో కలిసి ఆయన తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి కవిత జాగృతి కండువా కప్పారు. కల్వకుంట్ల కవిత తన తెలంగాణ జాగృతి సంస్థను త్వరలో రాజకీయ పార్టీగా మార్చబోతున్నామని పేర్కొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## జీవన్ రెడ్డి పండుగ అయిపోయింది

**ప్రధాన కార్యదర్శి పదవి స్థాయేంటో చూద్దాం**

**కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా**



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరగానే కేసీఆర్ జనరల్ సెక్రటరీ పదవి ఇచ్చారని, కానీ ఆ పదవి స్థాయి ఏమిటనేది ఆయనకే తెలియాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్‌లో చేరడంతో జీవన్ రెడ్డి పండుగ అయిపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి పీసీసీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని భావించిందని తెలిపారు. కానీ ఆయన కాంగ్రెస్ పార్టీలో అలిగినట్లుగా బీఆర్ఎస్ పార్టీలో అలిగితే పట్టించుకోరని విమర్శించారు. పొన్నాల లక్ష్మయ్య పీసీసీ ప్రెసిడెంట్‌గా చేసి, ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన పరిస్థితి ఎలా ఉందో చూడాలని అన్నారు. ఆయన వీడియోలు చేసుకుని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారని, రేపు జీవన్ రెడ్డి పరిస్థితి అంతే అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమని చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మెట్రో ఫేజ్ 2, ట్రిపుల్ ఆర్, మూసీ ప్రక్షాళన అంశాల్లో బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి జరిగిందని భావిస్తే, సీబీఐ ఆయన శాఖ పరిధిలోనే ఉందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐకి ఆదేశిస్తే 24 గంటల్లో విచారణ చేస్తామని కిషన్ రెడ్డి తొమ్మిది నెలల క్రితం చెప్పారని గుర్తు చేశారు. కానీ సీబీఐకి ఇస్తే ఇప్పటి వరకు ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. అవసరం లేని వాటికే సీబీఐ, ఈడీలను బీజేపీ ప్రయోగిస్తోందని ఆరోపించారు.

## మంచిర్యాల మండిపోతోంది!

### అత్యంత వేడి నగరాల్లో 14వ స్థానం.. అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు




మంచిర్యాల, ఏప్రిల్ 21 (ఈవార్తలు): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే, మంచిర్యాల ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ 'ఎల్డోరాడో వెదర్' తాజాగా రూపొందించిన ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాలో మంచిర్యాల 14వ స్థానంలో నిలవడం గమనార్హం. సోమవారం (ఏప్రిల్ 20) మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటం వల్ల, మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను అమాంతం పెంచుతున్నాయి. దీనికి తోడు 2021లో 18,561 చదరపు కిలోమీటర్లుగా ఉన్న తెలంగాణ అటవీ విస్తీర్ణం, 2023 నాటికి 18,456 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. ప్రధానంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పచ్చదనం తగ్గడం వల్లే సహజసిద్ధమైన చల్లదనం లోపించి హీట్ వేవ్స్ తీవ్రత పెరుగుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాజధాని హైదరాబాద్‌లోని పట్టణ ప్రాంతాలు కూడా గ్లోబల్ హీట్ లిస్టులో చేరుతున్నాయి. మూసీ నది పరీవాహక ప్రాంతం కావడం, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాలు పడిపోవడం వల్ల ఇక్కడ వేడి ఎక్కువగా ట్రాప్ అవుతోంది. నగరంలోని న్యూ నాగోల్ ప్రాంతంలో 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, ముషీరాబాద్‌లో 41.6, అంబర్‌పేటలో 41.4, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 41.3, మెహదీపట్నంలో 41.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఎండలు దంచికొడుతున్నా.. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల ఊరట లభించే అవకాశం ఉంది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, పగటి పూట ఎండ తీవ్రత మాత్రం 40 నుంచి 45 డిగ్రీల మధ్యే కొనసాగే ప్రమాదం ఉందని, బయటకు వచ్చే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## కేసీఆర్ కళ్ల ముందే బీఆర్ఎస్ అంతం కావాలి

నిజామాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతమవడం చూడాలని తాము కోరుకుంటున్నామని, అది కూడా త్వరలో జరుగుతుందని నమ్ముతున్నామని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కేసీఆర్‌ను అందరికంటే ఎక్కువగా కేటీఆర్, కవిత, హరీశ్ రావులే హింసిస్తున్నారని ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టిక్కెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుందని వ్యాఖ్యానించారు.

## రేవంత్ ఆంధ్రా నాయకుల తొత్తు

**బీజేపీతో టచ్‌లో టీజీ సీఎం**

**మధ్యలో వారధిలా చంద్రబాబు**

**జీవన్ రెడ్డి సంచలన ఆరోపణలు**



జగిత్యాల, ఏప్రిల్ 21 (ఈవార్తలు): గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీపై, మరీ ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న జీవన్ రెడ్డి.. తాజాగా మరోసారి విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఎక్కువ కాలం కాంగ్రెస్ పార్టీలో ఉండరని.. బీజేపీలోకి వెళ్తాడని జోస్యం చెప్పారు. ఇక రేవంత్ రెడ్డి బీజేపీలో చేరేందుకు ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉన్నారని విమర్శలు గుప్పించారు. చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని పేర్కొన్న జీవన్ రెడ్డి.. కానీ ఆయన బీజేపీతో టచ్‌లో ఉన్నారని జీవన్ రెడ్డి తాజాగా చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. రేవంత్ రెడ్డికి, బీజేపీకి మధ్య వారధిలా ఎలాగూ చంద్రబాబు నాయుడు ఉన్నారని ఆరోపించారు. చంద్రబాబు తనను కాపాడుతాడని రేవంత్ రెడ్డి భ్రమ పడుతున్నారని జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇక సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లి సభ వేదికగా తనపై రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపైనా జీవన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఎన్టీఆర్ హయంలో నాదెండ్ల భాస్కర్ రావును మంత్రి పదవి నుంచి తొలగించినప్పుడు.. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తనను ఎవరూ మంత్రి పదవి నుంచి తొలగించలేదని.. తానే రాజీనామా చేసినట్లు జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు. నాదెండ్ల భాస్కర్ రావుకు తాను ఒక్కడిని మాత్రమే కాదని.. ఆ రోజు ఇందిరా గాంధీ, మొత్తం కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచినట్లు స్పష్టం చేశారు. అయితే ఆ విషయం రేవంత్ రెడ్డికి తెలియదు అనుకుంటా అంటూ జీవన్ రెడ్డి సెటైర్లు వేశారు. ఆంధ్రా నాయకులకు తొత్తుగా రేవంత్ రెడ్డి మారారని.. ఆంధ్రా నాయకుల చేతిలో కీలు బొమ్మలాగా మారారని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. వేం నరేందర్ రెడ్డికి ఎందుకు రాజ్యసభ సీటు ఇచ్చారని ప్రశ్నించారు. 2015లో కూడా వేం నరేందర్ రెడ్డిని టీడీపీ నుంచి ఎమ్మెల్సీ చేయాలని చూసిన రేవంత్ రెడ్డి.. ఓటుకు నోటులో దొరికిపోయారని ఆరోపించారు.

## మోదీకి పేరు వస్తుందనే మహిళా బిల్లుకు అడ్డుకట్ట

**ప్రతిపక్షాలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ**

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షాల తీరును ఆమె ఎండగట్టారు. మహిళలు చట్టసభల్లోకి రావడం ఇష్టం లేకే విపక్షాలు కుట్రపూరితంగా వ్యవహరించాయని ఆమె ఆరోపించారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ హుందాగా వ్యవహరించలేదని, మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే ప్రధాని మోదీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న భయంతోనే కాంగ్రెస్ దీనిని అడ్డుకుందని ఆమె మండిపడ్డారు. వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారం కేవలం అపోహ మాత్రమేనని డీకే అరుణ అన్నారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విడగొట్టేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడీపీ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేయాలంటున్న సీఎం రేవంత్ రెడ్డి... ఆ సాకుతో హైదరాబాద్‌లోనే ఎక్కువ సీట్లు పెంచుకోవాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈనెల 24న గవర్నర్ శివప్రతాప్ శుక్లా మహబూబ్ నగర్‌లో పర్యటించనున్నారని, 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్' విజేతలకు ఆయన బహుమతులు అందజేస్తారని వెల్లడించారు.

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))


| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com



# స్కూటీ అదుపుతప్పి బాలుడు మృతి



మల్యాల/గొల్లపల్లి, ఏప్రిల్ 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతపూర్‌కు చెందిన చిర్ర శ్రీచరణ్(15) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, చరణ్ ఎలక్ట్రిక్ స్కూటీపై పెగడపల్లి నుంచి స్వగ్రామానికి వస్తుండగా దట్నూర్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తలకు తీవ్ర గాయాలై ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. చిన్న వయసులోనే శ్రీచరణ్ మృతి చెందడంతో బల్వంతాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి భూమేశ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి: వీహెచ్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): ఆడబిడ్డల పెళ్లి ఆ కుటుంబానికి ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటోందని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. మంగళవారం అంబర్ పేట నియోజకవర్గంలో 400 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్ లతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాల కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు మాట్లాడుతూ.. ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాల్లో కల్యాణలక్ష్మితో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగు నింపుతుందని అన్నారు. అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న పేదల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

## తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఈవార్తలు): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్రను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో విద్యార్థి నేతలు సంజయ్ (ఓయు), ఉమేష్ (వెటర్నిటి), వంశీ (అగ్రికల్చర్) పాపారావు (తెలంగాణ), మహేందర్ (కాకతీయ), అజయ్ (నిజాం), రాకేష్ (సెంట్రల్ యూనివర్సిటీ) తో కలిసి ఆయన మాట్లాడుతూ... ఫీజులు కట్టలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, మానసిక వేదనకు గురవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని అంటున్నాయని, ఇటు కాలేజీ యాజమాన్యల ఒత్తిడి, అటు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మధ్య పేద విద్యార్థుల



కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు జీతాలు ప్రతి నెలా వేల కోట్లు మంజూరవుతున్నా, విద్యార్థుల పీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు మాత్రం మంజూరు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తిరగబడితే ప్రభుత్వాలే కూలిపోయే పరిస్థితి ఉంటుందని ఆ పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి రాకూడదని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే విద్యార్థి ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



# పవన్ కల్యాణ్ ఆరోగ్యం కోసం కొండగట్టులో పూజలు

మల్యాల, ఏప్రిల్ 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ చొప్పదండి నియోజకవర్గ జనసేన శ్రేణులు జగిత్యాల జిల్లాలోని ప్రఖ్యాత కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావాలని జనసేన నేతలు స్వామిని కోరుకున్నారు. ఈ పూజల్లో మొగిలిపాలెం రమేశ్, తడగొండ నర్సింగ్ బాబు, దూడం శ్రీనాథ్, కనకట్ల శ్రీనివాస్, పలువురు జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనకాపల్లిలో రీన్యూ సోలార్ ప్లాంట్

**రూ.5,400 కోట్లతో నిర్మాణం.. రేపు శంకుస్థాపన చేయనున్న చంద్రబాబు**

అనకాపల్లి, ఏప్రిల్ 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడికి రంగం సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో సుమారు రూ. 5,400 కోట్ల వ్యయంతో సోలార్ ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ రీన్యూ ఎనర్జీ గ్లోబల్ ముందుకొచ్చింది. ఈ మెగా ప్రాజెక్టుకు ఏప్రిల్ 23న ముఖ్యమంత్రి చంద్రబాబు, రీన్యూ సీఈఓ సుమంత్ సిన్హాతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 4,200 కోట్లతో 6 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ఇంగోట్-వేఫర్ తయారీ ప్లాంట్‌ను, మరో రూ. 1,200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను రీన్యూ నిర్మించనుంది. కేవలం 24 నెలల రికార్డు సమయంలోనే ఈ ప్లాంట్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,100 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సోలార్ పీవీ మాడ్యూల్స్, సెల్స్ తయారీకి అత్యంత కీలకమైన ఇంగోట్స్, వేఫర్లను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా సోలార్ సరఫరా రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ ప్లాంట్ దోహదపడనుంది. 2015 నుంచి రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న రీన్యూ, ఇప్పటికే అనంతపురం జిల్లాలో రూ. 22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. తాజా ప్రాజెక్టుతో కలిపి రాష్ట్రంలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టుతో అనకాపల్లి పారిశ్రామిక ముఖచిత్రం మారనుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఎన్టీఆర్‌లా పేదల సేవలో ఉంటా

**గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు**

విజయనగరం, ఏప్రిల్ 21 (ఈవార్తలు): గత ప్రభుత్వ హయాంలో కొందరు నాయకులు నరకాసురుని శిష్యుల్లా వ్యవహరించారని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఆరోపించారు. ఎన్నో తప్పులు చేశారని మండిపడ్డారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నీలాచలం కొండపై కొలువుదీరిన రాములోరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో రాముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని ఇప్పటికీ పట్టుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల్లోనే నిందితులను గుర్తిస్తామని చెప్పిన నాటి పాలకులు హామీని నిలబెట్టుకోలేకపోయారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200లకు పైగా ఆలయాలపై దాడులు జరిగినా ఏం చేయలేకపోయారని గుర్తు చేశారు. కొన్ని అపశృతులు జరిగాయని, వాటన్నింటినీ సరిదిద్దాల్సిన అవసరం ఉందని కోరారు. తాను టీడీకి రాజీనామా చేసినా, ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పేదల సేవలోనే ఉంటానన్నారు.



# కొండగట్టు అంజన్న గుడిలో అంతర్గత బదిలీలు

మల్యాల, ఏప్రిల్ 21 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు, ప్రమోషన్లు చేపట్టారు. ఈ మేరకు ఆలయ ఈవో అంజనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాల ప్రకారం డీ సునీల్ కుమార్‌కు సూపరింటెండెంట్ పదవి కల్పించారు. ఆయన పరిపాలన విభాగం, లీగల్, లీజులు, లైసెన్సులు, కోర్టు కేసులు, భూములు, ప్రసాదం, అకౌంట్స్, మనీవాల్యూ, ఇంజనీరింగ్, సిబ్బంది విధి నిర్వహణ, బుకింగ్ కౌంటర్లు, దేవాలయ విభాగాల పర్యవేక్షణ, అన్నదానం పర్యవేక్షణ వంటి బాధ్యతలు చూస్తారు. యూ చంద్రశేఖర్‌కు సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ఆయన దేవాలయ పర్యవేక్షకులు, పీఆర్వో, సానిటేషన్, గదుల విచారణ కార్యాలయం, సబ్ టెంపుల్స్, కళ్యాణ కట్ట నిర్వహణ, హోం గార్డు, సెక్యూరిటీ గార్డుల విధుల పర్యవేక్షణ, వాహన పూజల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. యాదగిరిగుట్ట నుంచి బదిలీపై వచ్చిన ఎస్. పవన్ కుమార్‌కు పరిపాలన విభాగం, అకౌంట్స్ విభాగాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. టీ ధర్మేంధర్‌కు ప్రసాదాల విభాగం బాధ్యతలు, తూమ్ శ్రీనివాస్‌ను దేవాలయ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. టీ అశోక్‌కు అన్నదానం విరాళాల సేకరణ బాధ్యతలు, కే రామును మనీవాల్యూ, స్టేషనరీ, రికార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పొందిన చంద్రశేఖర్‌ను ఆలయ అర్చక సంఘం సన్మానించింది. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు కపిందర్, అర్చకులు ఆయనను శాలువతో కప్పి అభినందించారు.



## లవ్యూరి చిత్రం




## బాలయ్య మూవీలో కాజల్

టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలలో ఆరు పదుల వయసు దాటినా వరుస అవకాశాలు అందుకోవడమే కాకుండా విజయ పరంపరా కొనసాగిస్తూ అందరినీ ఆశ్చర్యపరిస్తున్నారు బాలకృష్ణ. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి అంటూ వరుస సినిమాలతో వరుస విజయాలతో స్టార్డంను మరింత పెంచేసుకున్నారు. ఇప్పుడు ఈ వయసులో కూడా యంగ్ హీరోలకి పోటు ఇస్తూ వరుస సినిమాలను లైన్లో పెట్టేస్తున్నారు బాలకృష్ణ. ఈ క్రమంలోనే తాజాగా ఈయన డైరెక్టర్ గోపీచంద్ మలినేని తో మరోసారి జతకట్టారు . ఇదివరకే వీరిద్దరి కాంబినేషన్లో వీరసింహారెడ్డి సినిమా వచ్చి మంచి విజయం సాధించింది. ఇక ఆ హిట్ కాంబో మళ్లీ తెరపైకి ఎన్బికె 111 అనే పేరుతో రాబోతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇకపోతే మొదట లేడీ సూపర్ స్టార్ నయనతారను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసినట్లు వార్తలు వినిపించాయి. అయితే స్క్రిప్టు మార్పులు, కాల్ షీట్ సమస్యల వల్లే ఈ సినిమా నుండి నయనతార తప్పుకున్నట్లు తెలుస్తోంది.. ఇక ఇప్పుడు ఆమె స్థానంలోకి కాజల్ అగర్వాల్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇదివరకే బాలయ్య - కాజల్ కాంబినేషన్లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో భగవంత్ కేసరి సినిమా వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సెంటిమెంట్ ని కొనసాగించాలని చిత్ర బృందం భావిస్తుండగా కాజల్ కూడా కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. ఇక త్వరలోనే ఈ విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.





## ఇప్పట్లో కేజీఎఫ్ 3 కష్టమే!

కేజీఎఫ్ చాప్టర్ 1, చాప్టర్ 2 చిత్రాలు పాన్ ఇండియా వైడ్‌గా బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సంచలనాలు సృష్టించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సిరీస్‌తో ఒక్కసారిగా లైమ్ లైట్‌లోకి వచ్చేసి స్టార్‌గా ఎదిగిన హీరో యష్. అంత వరకు మినిమమ్ బడ్జెట్ చిత్రాల హీరోగా, కన్నడ ఇండస్ట్రీకి మాత్రమే పరిమితమైన యష్ ఈ సిరీస్ సినిమాలతో పాన్ ఇండియా స్టార్‌గా మారాడు. దేశ వ్యాప్తంగా స్టార్ డమ్‌తో పాటు భారీ ఫాన్ బేస్‌ని క్రియేట్ చేసుకున్నాడు. 2022లో విడుదలైన -కేజీఎఫ్ చాప్టర్ 2- ప్రపంచ వ్యాప్తంగా రికార్డు స్థాయి విజయాన్ని సాధించిన బాక్సాఫీస్ వద్ద రూ.1200 కోట్లు రాబట్టి ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురి చేసింది. ఈ మూవీ తరువాత -కేజీఎఫ్ చాప్టర్ 3-ని మేకర్స్ మూవీ లాస్ట్‌లో ప్రకటించి సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశారు. అయితే సినిమా విడుదలై మూడేళ్లకు పైనే అవుతున్నా దీని గురించి మేకర్స్ హోంబలే ఫిలింస్ విజయ్ కిరగందూర్ కానీ, దర్శకుడు ప్రశాంత్ నీల్ కానీ, హీరో యష్ కానీ అప్ డేట్ ఇవ్వలేదు. దర్శకుడు ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో -సలార్-ని చేశారు. అది పూర్తయి రిలీజ్ అయింది కూడా. ఇప్పుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌తో -డ్రాగన్- మూవీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే యష్ అభిమానులు -కేజీఎఫ్ 3-కి సంబంధించిన అప్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా దీని గురించి టీమ్ అప్ డేట్ ఇస్తుందని వేచి చూస్తున్న అభిమానులకు తాజాగా హీరో యష్ షాక్ ఇచ్చారు. వరుస ప్రాజెక్ట్‌లలో బిజీగా ఉండటం వల్ల -కేజీఎఫ్ 3- ఇప్పట్లో కష్టమని క్లారిటీ ఇవ్వడంతో అభిమానులు షాక్‌కు గురవుతున్నారు.

## మృణాల్‌తో ధనుష్ మరో సినిమా



తమిళ స్టార్ హీరో ధనుష్ మళ్లీ డైరెక్షన్‌లోకి రానున్నాడన్న వార్తలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఈసారి ఫీమేల్ సెంట్రిక్ పీరియడ్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆయన భావిస్తున్నారన్న ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ పేరు వినిపించడం మరింత హైప్ తీసుకొస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ చుట్టూ తిరుగుతున్న అసలు చర్చ మాత్రం కేవలం సినిమా కంటెంట్ గురించే కాదు.. ధనుష్-మృణాల్ మధ్య బాండింగ్ గురించి జరుగుతున్న ప్రచారం, వ్యక్తిగత రూమర్స్ కూడా ఈ కథనానికి అదనపు బజ్ తీసుకొస్తున్నాయి. కొన్ని నెలల క్రితం నుంచే ధనుష్- మృణాల్ మధ్య రిలేషన్ ఉందన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే మృణాల్ ఒక ఇంటర్వ్యూలో ఆ వార్తలను ఖండిస్తూ, తాము జస్ట్ ఫ్రెండ్స్ మాత్రమేనని స్పష్టం చేశారు. అయినప్పటికీ, ఇప్పుడు ఇద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారన్న ప్రచారం మళ్లీ ఆ గాసిప్స్‌కు ఊపిరి పోసినట్లైంది. ఇండస్ట్రీలో సాధారణంగా ఆన్‌స్క్రీన్ జోడీలకు, ఆఫ్ స్క్రీన్ రూమర్స్ జతకట్టడం కొత్త విషయం కాదు. కానీ ఇలాంటి గాసిప్స్ ఒక ప్రాజెక్ట్‌కు ముందస్తు పబ్లిసిటీగా మారే అవకాశమూ ఉంటుంది. ఈ నేపథ్యంలో, ధనుష్-మృణాల్ కలయిక కేవలం క్రియేటివ్ డెసిషనా, లేక పబ్లిసిటీ పరంగా కూడా లాభదాయకమా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## 'ఆవారాపన్ 2'లో దిశా పటానీ పవర్‌ఫుల్ రోల్



బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ ఇప్పుడు ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ఇమ్రాన్ హష్మీ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆవారాపన్ 2'లో దిశా హీరోయిన్‌గా నటిస్తోంది. 'ఆవారాపన్ 2' చిత్రంలో దిశా పటానీ భాగం కావడంతో సినిమా స్థాయి మరింత పెరిగిందని చిత్ర బృందం భావిస్తోంది. నిర్మాత విశేష్ భట్ మాట్లాడుతూ.. "దిశా పటానీ ఈ ప్రాజెక్ట్‌లో చేరడం వల్ల 'ఆవారాపన్' ప్రపంచం సరికొత్త అవకాశాలకు వేదికైంది" అని ప్రశంసించారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఇమ్రాన్ హష్మీ సరసన అత్యంత పవర్‌ఫుల్, ఎమోషనల్ పాత్రలో దిశా మెరిసిపోనుంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ, దిశా యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. ఇమ్రాన్ హష్మీ సినిమాలంటేనే పాటలు ఒక రేంజ్‌లో ఉంటాయి. ఈ సీక్వెల్‌లో కూడా దిశా పటానీపై చిత్రీకరించే పాటలు మళ్ళీ పాత 'ఆవారాపన్' మ్యాజిక్‌ను తీసుకువస్తాయని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకత్వంలో రాబోతుంది. విశేష్ ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో విడుదలవుతున్న ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఎదురుకానుంది.

## నేను తమిళ అమ్మాయినే

టాలెంట్, సహజమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సాయి పల్లవి, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన 'రామాయణ' చిత్రంలో సీతగా నటిస్తూ బిజీగా ఉంది. అయితే, కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా, గతంలో



తాను చేసిన ఒక వ్యాఖ్యను కొందరు వక్రీకరించడంపై తాజాగా ఆమె స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఏం జరిగిందంటే... దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో, "మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?" అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి సాయి పల్లవి సమాధానమిస్తూ, "నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు" అని స్పష్టం చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత కొందరు ఈ మాటలను వక్రీకరించి, "మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది" అంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ ప్రచారంపై తాజాగా ఆమె స్పందిస్తూ.. "ఆ హెడ్‌లైన్ చూసి నేను షాక్‌కు గురయ్యాను. నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం.

## 20 ఏళ్ల మడోన్నా పెర్ఫార్మెన్స్



పాప్ సంగీత ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న లెజెండరీ సింగర్ మడోన్నా ప్రఖ్యాత కోచెల్లా మ్యూజిక్ ఫెస్టివల్‌లో మరోసారి మెరిశారు. యువ గాయని సబ్రినా కార్పెంటర్ ప్రదర్శనలో ఆమె ఆకస్మికంగా వేదికపైకి వచ్చి అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. తన రాబోయే ఆల్బమ్ "కన్ఫెషన్స్"ని ఈ వేదికపై ప్రదర్శించారు. ఈ చారిత్రక ప్రదర్శన అనంతరం మడోన్నా ఇన్‌స్టాగ్రామ్‌లో తన ఆనందాన్ని పంచుకున్నారు. సబ్రినాతో కలిసి దిగిన ఫోటోలను షేర్ చేస్తూ.. "కోచెల్లాలో శుక్రవారం రాత్రి నుంచి ఇంకా ఆనందంలోనే తేలియాడుతున్నాను. 'కన్ఫెషన్స్ 'ను తిరిగి దాని పుట్టింటికి తీసుకురావడానికి సహకరించిన సబ్రినాకు, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది ఒక అద్భుతమైన అనుభూతి! చరిత్రలో నిలిచిపోయే ఈ క్షణాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఎంతో స్వేచ్ఛగా ఫీల్ అవుతున్నాను" అని రాసుకొచ్చారు. దాదాపు 20 ఏళ్ల క్రితం మడోన్నా ఇదే కోచెల్లా వేదికపై తన 'కన్ఫెషన్స్ ఆన్ ఏ డ్యాన్స్ ఫ్లోర్ పార్ట్ వన్' ఆల్బమ్‌ను అమెరికాలో తొలిసారి ప్రదర్శించారు. ఆ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ "20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇదే వేదికపైకి రావడం మాటల్లో చెప్పలేని థ్రిల్‌ను ఇచ్చింది" అని ఆమె పేర్కొన్నారు. 67 ఏళ్ల మడోన్నా పాప్ సంగీతంలో ఓ ఐకాన్‌గా నిలిచారు. సామాజిక, రాజకీయ, లైంగిక, మతపరమైన అంశాలతో ఆమె పాడిన పాటలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. "లైక్ ఏ వర్జిన్", "మ్యూజిక్", "హంగ్ అప్" వంటి ఆమె పాటలు ఎప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా నిలిచిపోయాయి. దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ అదే ఉత్సాహంతో వేదికపై ప్రదర్శన ఇవ్వడం ఆమెకే చెల్లింది.


# అభిషేక్.. రైజర్స్ హ్యాట్రిక్

సొంతగడ్డపై హైదరాబాద్ అద్భుత విజయం
ఢిల్లీపై 47 పరుగుల తేడాతో గెలుపు
బౌలింగ్‌లో మలింగ, హర్ష్ దూబే నిప్పులు

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 6 | 5 | 0 | 11 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 |
| హైదరాబాద్ | 7 | 4 | 3 | 8 |
| రాజస్థాన్ | 6 | 4 | 2 | 8 |
| ఢిల్లీ | 6 | 3 | 3 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | 6 |
| ముంబై | 6 | 1 | 4 | 4 |
| చెన్నై | 6 | 2 | 4 | 4 |
| లక్నో | 6 | 2 | 4 | 4 |
| కోల్‌కతా | 7 | 1 | 5 | 3 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు





ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. సొంత మైదానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ పరుగుల సునామీ సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ అజేయ, విధ్వంసకర శతకంతో కదం తొక్కడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది.

సొంతగడ్డపై సన్‌రైజర్స్ కు ఇది వరుసగా మూడో విజయం. ఈ విజయంతో ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ బ్యాటింగ్ ప్రదర్శన విధ్వంసక రీతిలో సాగింది.


ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలింగ్ ను ఊచకోత కోశాడు. కేవలం 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37), ఇషాన్ కిషన్ (25) వేగంగా ఆడగా, చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ, క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. నితీశ్ రాణా (30 బంతుల్లో 57), సమీర్ రిజ్వీ (41), కేఎల్ రాహుల్ (37) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ పేసర్ ఎషాన్ మలింగ తన పదునైన బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. కీలకమైన డేవిడ్ మిల్లర్ (0), ట్రిస్టన్ స్టబ్స్ (27) సహా మొత్తం 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. మరోవైపు, యువ స్పిన్నర్ హర్ష్ దూబే తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు. కేవలం 2 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ ఓటమిని ఖాయం చేశాడు. దీంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులకే పరిమితమైంది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 7 మ్యాచ్‌లలో 4 విజయాలు, 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడం ఆరెంజ్ ఆర్మీ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

**టీ20ల్లో అత్యధిక సెంచరీల వీరులు**

క్రిస్ గేల్ (వెస్టిండీస్)- 22 సెంచరీలు
బాబర్ ఆజం (పాకిస్తాన్)- 12 సెంచరీలు
డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా)- 10 సెంచరీలు
క్వింటన్ డికాక్ (సౌతాఫ్రికా)- 9 సెంచరీలు
విరాట్ కోహ్లి (ఇండియా)- 9 సెంచరీలు
రిలీ రొసోవ్ (సౌతాఫ్రికా)- 9 సెంచరీలు
సాహిబ్‌జాదా ఫర్హాన్ (పాకిస్తాన్)- 9 సెంచరీలు
అభిషేక్ శర్మ (ఇండియా)-9 సెంచరీలు.

## చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ సెంచరీతో మెరిశాడు. ఆది నుంచి దూకుడుగా ఆడిన ఈ లెఫ్టాండర్ బ్యాటర్ 47 బంతుల్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. తద్వారా ఐపీఎల్‌లో తన రెండో శతకాన్ని నమోదు చేశాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లి పేరిట ఉన్న టీ20 సెంచరీల రికార్డును సమం చేశాడు. కోహ్లి తర్వాత పొట్టి క్రికెట్‌లో అత్యధిక శతకాలు బాదిన భారత క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు.



## నటాషా తగ్గేదేలే..!

భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్యా మాజీ భార్య నటాషా రోజు రోజుకు హద్దులు దాటుతోంది. భర్తకు విడాకులు ఇచ్చిన తర్వాత, పొట్టి బట్టల్లో కనిపిస్తూ యూత్ ను ఆకట్టుకుంటుంది. మహికా శర్మతో హార్దిక్ పాండ్యా ఎంజాయ్ చేస్తుంటే, తానేం తక్కువేం కాదన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఇక లేటెస్ట్ గా హాట్ ఫోటోలను పంచుకుంది నటాషా. ప్రైవేట్ అందాలు కనిపించేలా బట్టలు ధరించి సెల్ఫీలు దిగి మరి ఫోటోలు షేర్ చేసింది. దీంతో ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. ఇవి చూసిన క్రికెట్ అభిమానులు తమకు నచ్చిన స్టైల్ లో కామెంట్స్ చేస్తున్నారు. సమ్మర్ లో హీట్ పెంచేస్తోందని బోల్డ్ గా రియాక్ట్ అవుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాల కిందట నటాషా, హార్దిక్ పాండ్యా ఇద్దరు విడాకులు తీసుకున్నారు. ఇద్దరి నిర్ణయం ప్రకారమే కోర్టు విడాకులు మంజూరు చేసింది. ఇక నటాషాకు విడాకులు ఇచ్చిన తర్వాత మహికా శర్మతో ఎంజాయ్ చేస్తున్నాడు పాండ్యా. త్వరలోనే మహికాను పెళ్లి చేసుకోబోతున్నాడు పాండ్యా. అటు అగస్త్య పాండ్యా మాత్రం, కొన్ని రోజులు నటాషా..మరికొన్ని పాండ్యా దగ్గర ఉంటున్నాడు.

## కోహ్లీ 'టేస్ట్' ఇన్‌స్టా పోస్ట్‌పై ఇజాబెల్ అసహనం

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి సోషల్ మీడియాలో వార్తల్లో నిలిచాడు. అయితే ఈసారి ఆట గురించి కాదు, తన పాత ప్రేమ వ్యవహారం గురించి. కోహ్లీకి సంబంధించిన ఓ వైరల్ పోస్ట్‌పై అతడి మాజీ ప్రియురాలు, బ్రెజిలియన్ నటి ఇజాబెల్ లీట్ స్పందించడంతో ఈ విషయం చర్చనీయాంశమైంది. విరాట్ కోహ్లీకి సంబంధం ఉన్న మహిళల ఫోటోలతో ఓ ఇన్‌స్టాగ్రామ్ పేజీ కొలాజ్ క్రియేట్ చేసింది. అందులో అతడి భార్య అనుష్క శర్మ, మాజీ ప్రేయసి ఇజాబెల్ లైట్, ఇటీవల కోహ్లీ లైక్ చేసిన జర్మన్ ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్, నటి అవ్నీత్ కౌర్ ఫోటోలు ఉన్నాయి. "ఫీల్డ్‌లో, ఆఫ్ ఫీల్డ్‌లో కోహ్లీ అస్సలు మిస్ అవ్వడు. అతడి టేస్ట్ చాలా ఎలైట్‌గా ఉంటుంది" అంటూ ఆ పోస్ట్‌కు క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్ చూసిన ఇజాబెల్ తన అసహనాన్ని వ్యక్తం చేసింది. తన ఫోటోను కోహ్లీతో లింకప్ చేస్తూ కొలాజ్ ఫోటో పెట్టడం పట్ల అభ్యంతరం వెలిబుచ్చింది. "ఇది జరిగి (కోహ్లీతో అఫైర్) 12 ఏళ్లు గడిచాయి. ప్రజలు ఇంకా దీన్ని ఎందుకు మర్చిపోలేకపోతున్నారు?" అని ఆమె కామెంట్ రూపంలో ప్రశ్నించింది. ఆమె వ్యాఖ్యకు చాలా మంది నెటిజన్లు మద్దతు పలికారు. ఇటీవల విరాట్.. జర్మన్ ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ ఫోటోను ఇన్‌స్టాలో లైక్ చేసి, వెంటనే అన్‌లైక్ చేశారు. గతంలో అవ్నీత్ కౌర్ ఫోటోను లైక్ చేసినప్పుడు అది 'అల్గారిథమ్ ఎర్రర్' అని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే తాజా పోస్ట్ వైరల్ అయింది. ఇజాబెల్ లీట్ 2014లో విరాట్‌తో రెండేళ్లు డేటింగ్ చేసినట్లు ధృవీకరించారు. అనంతరం 2017లో కోహ్లీ, అనుష్క శర్మను వివాహం చేసుకోగా, వారికి వామిక, అకాయ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఈ వైరల్ పోస్ట్, దానిపై ఇజాబెల్ స్పందన సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

## యూసఫ్ పఠాన్ మామ గూండాగిరీ



ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు పోలీసు కేసులకు దారితీసింది. టీమ్ ఇండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ మామ, ఆయన కుమారుడు, మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుంబంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ గొడవ రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. ముంబైలో కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. ఆ దారిలో వెళ్తున్న ఒక కారు, గుంతలోని నీటిని రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు, కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను స్పష్టంగా గుర్తించారు. దాడికి ఉపయోగించిన వెదురు కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు.

## చాహల్ వద్దు.. కోహ్లీ కావాలి



టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది. యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.



## ముంబై జట్టులోకి విల్ జాక్స్

ముంబై ఇండియన్స్‌కు శుభవార్త. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ అందుబాటులోకి వచ్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా అతడు ముంబై తరఫున బరిలోకి దిగే అవకాశం ఉంది. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో విల్ జాక్స్ అద్భుత ప్రదర్శన కనబరిచిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ తరఫున ఎనిమిది మ్యాచ్‌లలో కలిపి 226 పరుగులు చేసిన విల్ జాక్స్.. తొమ్మిది వికెట్లు కూల్చాడు. ఈ టోర్నీలో ఇంగ్లండ్ సెమీస్ ప్రయాణానికి దోహదం చేసిన ఈ ఆల్‌రౌండర్ నాలుగుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలిచాడు. ఈ పవర్ హిట్టర్‌ను ముంబై ఇండియన్స్ రూ. 5.25 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, వరల్డ్‌కప్ తర్వాత వ్యక్తిగత సెలవుపై వెళ్లిన విల్ జాక్స్ ముంబై ఆరంభ మ్యాచ్‌లకు మాత్రమే దూరమవుతాడని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, ఆరు మ్యాచ్‌లు పూర్తైనా అతడు జట్టుతో చేరలేదు. తాజా సమాచారం ప్రకారం విల్ జాక్స్ తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అతడు భారత్‌లో అడుగుపెట్టినట్లు సమాచారం. కాగా ముంబై ఇండియన్స్ ఇప్పటికి ఆరు మ్యాచ్‌లు ఆడి కేవలం రెండే గెలిచింది. ఇలాంటి తరుణంలో స్టార్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ జట్టుతో చేరనుండటం సానుకూలాంశం. కాగా ముంబై గురువారం చెన్నై జట్టుతో వాంఖడేలో తలపడనుంది.

## నా ఫేవరెట్ నేనే: సుజీత్ కల్కల్



సాధారణంగా ఏ రంగంలో అయినా... ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునే వాళ్లు... 'రోల్ మోడల్స్'ను ఆదర్శంగా తీసుకోవడం పరిపాటి! కానీ భారత యువ రెజ్లర్ సుజీత్ కల్కల్ మాత్రం తన అభిమాన ఆటగాడు తానే అని అంటున్నాడు. ప్రాక్టీస్‌లో భాగంగా ఇతర సీనియర్ రెజ్లర్ల వీడియోలకు బదులు తన వీడియోలే చూసి స్ఫూర్తి పొందుతానని చెబుతున్నాడు. కాగా 2025 జూన్‌లో జరిగిన అండర్-23 ఆసియా చాంపియన్‌షిప్ నుంచి మొదలుకొని ఇప్పటి వరకు 65 కేజీల విభాగంలో పరాజయం ఎరగకుండా ముందుకు సాగుతున్న సుజీత్... బరిలోకి దిగిన ప్రతి టోర్నమెంట్‌లో పసిడి పతకం చేజిక్కించుకున్నాడు. ఇటీవల కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి స్వర్ణం నెగ్గిన సుజీత్... తనను ఎవరూ ఓడించలేరు అనే భ్రమలో మాత్రం లేనని వెల్లడించాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
బుధవారం 22-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# మండుతున్న భూగోళం..

2026 వేసవి ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటడం కేవలం ఒక వాతావరణ మార్పు మాత్రమే కాదు, అది మన వ్యవస్థలకు ఒక తీవ్రమైన హెచ్చరిక. గడిచిన 2025లో 99% రోజులు దేశం ఏదో ఒక విపరీత వాతావరణ పరిస్థితులకు లోనైందని, దీనివల్ల 4,419 మంది మరణించారని 'స్టేట్ ఆఫ్ ఇండియా ఎన్విరాన్మెంట్ 2026' నివేదిక ఘోషిస్తోంది. 17.41 మిలియన్ హెక్టార్ల పంటలు నాశనం కావడం మన ఆహార భద్రతపై ముంచుకొస్తున్న ముప్పును సూచిస్తోంది. జనవరి నుండి నవంబర్ వరకు దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక రాష్ట్రంలో వేడిగాలులు, వరదలు లేదా తుఫానులు సంభవిస్తూనే ఉన్నాయి. ముంబై, వారణాసి, ప్రయాగ్‌రాజ్ వంటి నగరాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. ప్రస్తుతం మనం కేవలం వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు చెప్పే 'రియాక్టివ్' (స్పందించే) పద్ధతిలో ఉన్నాం. కానీ మనకు కావాల్సింది 'రెసిలియంట్' (తట్టుకోగల) వ్యవస్థలు. నగరాల్లో 'కూల్ రూఫ్' పాలసీలు, వర్టికల్ ఫారెస్ట్‌లు, నీటి వనరుల పునరుద్ధరణను తప్పనిసరి చేయాలి. వేడిని తట్టుకునే వరి, గోధుమ రకాలను సాగు చేయడం, సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థలను పెంచడం ద్వారా పంట నష్టాలను తగ్గించవచ్చు. సింగపూర్ వంటి దేశాల మాదిరిగా భవన నిర్మాణ శైలిలో మార్పులు తెచ్చి నగరాల వేడిని తగ్గించేలా డిజైన్ చేయాలి. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన 'హీట్ యాక్షన్ ప్లాన్' ఉండాలి, ఇది కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా కార్మికులకు పనివేళల మార్పు, నీడ సదుపాయాలు కల్పించేలా ఉండాలి. ప్రకృతి వైపరీత్యాలు ఇప్పుడు అరుదైన సంఘటనలు కావు, అవి ఒక కొత్త సాధారణం. స్టేట్ ఆఫ్ ఇండియా ఎన్విరాన్మెంట్ నివేదిక సూచించినట్లు, ఉపశమన నిధుల కంటే వాతావరణ మార్పులను తట్టుకునే మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడులు పెట్టడమే విజ్ఞత. ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా అడుగులు వేయకపోతే, వచ్చే వేసవిలు మరింత కఠినంగా మారడం ఖాయం.

# మారుతోంది
## తెలంగాణ రాజకీయం



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్టు



**తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన జగిత్యాల గడ్డపై ఏప్రిల్ 20న నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ చర్చనీయాంశంగా మారింది. లక్షలాది మంది గులాబీ జెండాలతో సభా ప్రాంగణాన్ని నింపగా, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేసిన సుదీర్ఘ ప్రసంగం రాజకీయంగా విస్తృత స్పందనను రేకెత్తించింది.**

ఈ సభ కేవలం పార్టీ కార్యక్రమంగా కాకుండా, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులకు ప్రతిబింబంగా నిలిచింది. సభలో ముఖ్య ఆకర్షణగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిక నిలిచింది. ఆరు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన చేరికను కేసీఆర్ స్వయంగా గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఉత్తర తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఇది సంకేతంగా భావిస్తున్నారు. రాజకీయంగా అనుభవజ్ఞులైన నాయకులు మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపడం, రాష్ట్రంలో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశంగా విశ్లేషకులు చూస్తున్నారు. కేసీఆర్ ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. హైదరాబాద్‌లో పేదల ఇళ్ల కూల్చివేతలు, హైడ్రా చర్యలు, భూముల సమస్యలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నించారు. అదే సమయంలో, తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇలాంటి విధానాలను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రైతు సమస్యలు కూడా ఆయన ప్రసంగంలో కీలకంగా నిలిచాయి. రైతు బంధు, రైతు భరోసా వంటి పథకాల అమలు విషయంలో ఆలస్యాలు జరుగుతున్నాయని, రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. ఎరువుల కొరత, సాగు ఖర్చులు పెరగడం వంటి సమస్యలను ప్రస్తావిస్తూ వ్యవసాయ రంగంపై ప్రభుత్వ దృష్టి తక్కువగా ఉందని విమర్శించారు. ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రియల్ ఎస్టేట్ రంగం మందగమనం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై కూడా ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో అమలైన పథకాలను గుర్తు చేస్తూ, ప్రస్తుత పరిస్థితులతో పోల్చారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీస్తున్నాయి. ప్రసంగంలో భావోద్వేగ అంశాలు కూడా ప్రధానంగా కనిపించాయి. తెలంగాణ ఉద్యమ కాలాన్ని గుర్తు చేస్తూ, రాష్ట్ర ఆత్మగౌరవం కాపాడాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.

జగిత్యాల నుంచి మరోసారి ప్రజా ఉద్యమానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. సభలో వినిపించిన నినాదాలు, ప్రజల స్పందన ఆ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జగిత్యాల సభ తెలంగాణ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన సంకేతాన్ని ఇచ్చింది. ఒకవైపు ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ తన స్థానం బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై పెరుగుతున్న విమర్శలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రసంగం విశ్లేషిస్తే, అది పూర్తిగా రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని బాధ్యత వహించేలా చేయాలనే ప్రయత్నంగా కూడా కనిపిస్తుంది. అయితే, ఈ విమర్శలు ఎంతవరకు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి? ప్రభుత్వానికి ఉన్న సవాళ్లు ఏమిటి? అనే అంశాలపై సమగ్ర చర్చ అవసరం ఉంది. రైతు సంక్షేమం, పేదల నివాస హక్కులు, పట్టణాభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలు ఏ ప్రభుత్వానికైనా కీలకం. ఈ అంశాలపై పాలకులు తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తాయి. కాబట్టి, రాజకీయ ఆరోపణలు-ప్రత్యారోపణలకు అతీతంగా, సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించడం అవసరం. జీవన్ రెడ్డి వంటి అనుభవజ్ఞుల చేరికతో బీఆర్ఎస్‌కు కొత్త ఊపు వచ్చినప్పటికీ, అది ఎంతవరకు ప్రజాభిప్రాయంగా మారుతుంది అన్నది భవిష్యత్తు రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. అదే సమయంలో, కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీల అమలు, పరిపాలనలో పారదర్శకత ద్వారా ప్రజల్లో నమ్మకం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే, జగిత్యాల సభ తెలంగాణ రాజకీయాల్లో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారబోతోందని సంకేతం ఇచ్చింది. ప్రజల ఆశలు, సమస్యలు, రాజకీయ వాగ్దానాలు.. ఇవన్నీ కలిసే వచ్చే రోజుల్లో రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించనున్నాయి.




# ఆస్తి పత్రాలు పోతే ఎలా..!

**ప్రతి వ్యక్తికి ప్రాణం ఎంత ముఖ్యమో సదరు వ్యక్తి ఆస్తి పత్రాలు కూడా అంతే ముఖ్యం. విలువ ఎంతటిదైనా ఆస్తి అనేది ఎంతో ముఖ్యమైనది. ఆ ఆస్తికి కొలమానం ఆస్తి పత్రాలు. ఆస్తి పత్రాలు లేనట్లైతే ఆస్తికి విలువ లేనట్లే. ఎంతటి ధీరుడైనా ఆస్తి పత్రాలు పోయినట్లైతే ప్రాణాలు పోయినంత మాదిరిగా బాధ పడాల్సిందే.ఆస్తి పత్రాలు లేని పక్షములో ఎలాంటి అమ్మకము, కొనుగోలు లావాదేవీలు జరగవు. కనీసం ఆస్తి పైన లోన్ కూడా లభించదు.**



ఏజే కరణ్‌లాల్
అడ్వొకేట్, 9492557496

కొన్ని సందర్భాలలో ప్రయాణము చేస్తున్నప్పుడుగానీ లేదా ఇతర సందర్భాలలోగానీ లేదా ఏదైనా దొంగతనము జరిగినప్పుడుగానీ ఆస్తి పత్రాలు పోవడం లేదా దొంగతనం కావడం జరుగుతుంది. లేదా ఏదైనా అనివార్య సందర్భములలో సదరు ఆస్తి పత్రాలు కాలిపోవడం జరుగుతుంది. లేదా ఆ ఆస్తి పత్రాలు ఎక్కడో పెట్టి మరచిపోవడం జరుగుతుంది, ఎంత వెతికిననూ దొరకవు. కొన్ని సందర్భాలలో కొందరైతే సదరు ఆస్తి పత్రాలను రక్షణ నిమిత్తము ఎవరి వద్దనో పెట్టి ఆ పత్రాలు ఎవరి వద్ద పెట్టారో కుటుంబ సభ్యులకు చెప్పరు. ఆ పత్రాలను తిరిగి వాపసు తీసుకునే లోపునే ఆ వ్యక్తి మరణించినట్లైతే ఆ ఆస్తి పత్రాలు ఎక్కడ ఉన్నాయో కుటుంబ సభ్యులకు తెలియక పోయినటువంటి ఎన్నో సందర్భాలను మనము చూస్తూ ఉంటాము. ముఖ్యముగా ఇలాంటి సందర్భములు పల్లెటూర్లలో ఇప్పటికీ జరుగుతుంటాయి. ఈ రోజులలో ఎలాంటి పత్రాలు లేకుండానే ఆన్ లైన్ మోసాలు మనము ఎన్నో చూస్తున్నాము. అలాంటిది ఒకరి ఆస్తి పత్రాలు మనకు తెలియని మోసాగాళ్ల చేతిలో పడినట్లైతే ఇంకా ఎలాంటి మోసాలు జరుగుతాయో మనం ఊహించగలం. ఇలాంటి పలు సందర్భాలలో, చాలా మందికి ఆస్తి పత్రాలు పోయినట్లైతే ఏమి చేయాలో తెలియదు. తమలో తామే కుమిలి పోతుంటారు. ఒకవేళ ఆస్తి ఒరిజినల్ పత్రాలు పోయినట్లైతే, ఆ పత్రాలు దొరికిన వ్యక్తి సదరు పత్రాలు తనవే అని చూపిస్తూ ఆ ఆస్తిని అమ్మకము జరపడమో లేక ఆ ఆస్తి పైన డబ్బు అప్పుగా తీసుకోవడమో అటువంటి సంఘటనలు ఎన్నో మనము చూస్తుంటాం. ఇలా ఆస్తి పత్రాలు పోయినప్పుడు.. మొదటగా ఆస్తి పత్రాలు పోయిన విషయమును ఏదైనా ప్రముఖ దిన పత్రికలో అందరూ చూసే విధంగా ప్రకటన వేయించాలి. తరువాత సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ వారి నుండి ఎనకుంబరెన్ సర్టిఫికెట్ (ఈసీ)ను పొందాలి.

ఈసీ, ప్రముఖ దిన పత్రికలో వచ్చిన ప్రకటనతో పాటుగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఆస్తి పత్రాలు పోయినట్లుగా ఫిర్యాదు దాఖలు చేయాలి. ఆ ఫిర్యాదును ఈ-సేవ ద్వారా కూడా దాఖలుపర్చవచ్చు. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని సంబంధిత పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్‌ను జారీ చేస్తారు., ఆ ఆస్తి పత్రాలు పోయినట్లుగా లాస్-అఫిడవిట్ నోటరీ చేయించాలి. పోలీసువారు సందర్భమును బట్టి పంచనామా జరిపించి లేదా విచారణ జరిపించి విచారణ నివేదకను విడుదల చేస్తారు. పైన తెలియపర్చిన అన్నీ పత్రములతో సదరు ఆస్తి పత్రాలు పోయినటువంటి ఆస్తి రిజిస్ట్రేషన్ జరిగినటువంటి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్టిఫైడ్ కాపీ కొరకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తును పరిశీలించిన పిమ్మట సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయం వారు సర్టిఫైడ్ కాపీని జారీ చేస్తారు. ఈవిధంగా పోయినటువంటి ఆస్తి పత్రాలకు పరిష్కారం పొందవచ్చు. ఇంకా సంపూర్ణ అవగాహన నిమిత్తము తగిన అనుభవం, అర్హతలు కలిగిగినటువంటి అడ్వకేట్ ద్వారా తగిన సలహాలు పొంది సమస్యకు పరిష్కారమును పొందవచ్చు.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.